నేటి నుంచి రేణుకాఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 10న ఉదయం 8 గంటలకు గురువందనం, స్వస్తి వచనం, గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 6 గంటలకు స్థాపిత దేవతా హవనములు, మూలమంత్ర జపం, 11న ఉదయం 8 గంటలకు స్థాపిత దేవతా పూజలు, హోమాలు, సాయంత్రం 4 గంటలకు సామూహిక కుంకుమార్చన, 12న చండీ హవనం, 10:45 గంటలకు రేణుకాఎల్లమ్మ అమ్మవారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోల్కొండ: వరల్డ్‌ సైట్‌ డే సందర్భంగా ప్రతియేటా అక్టోబర్‌ 2వ గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని మెహిదీపట్నంలోని మెడివిజన్‌ కంటి ఆసుపత్రి డాక్టర్‌ కె.రవికుమార్‌రెడ్డి అన్నారు. వరల్డ్‌ సైట్‌ డేను పురస్కరించుకొని గురువారం మెహిదీపట్నం ఎన్‌ఎండీసీ సమీపంలోని మెడివిజన్‌ కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ రవి కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..వరల్డ్‌ సైట్‌ డేను పురస్కరించుకొని తాము డయాబెటిక్‌ రెటినోపతి, గ్లకోమా స్క్రీనింగ్‌ పరీక్షలు ఉచితంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా తాము 500 మందికి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామన్నారు. డయాబెటిస్‌ రోగులకు కంటి పరిరక్షణ, క్యాటరాక్ట్‌ చేయించుకున్న మధుమేహ వ్యాధిగ్రస్తులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దోమలు స్వైర విహారం చేయడంతో స్థానిక ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది బస్తీల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పెద్ద ఎత్తున పేరుకుపోయిన అందులో దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బస్తీల్లో చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకొని దోమల నివారణకు బస్తీల్లో ఫాగింగ్‌ నిర్వహించాలని కోరుతున్నారు.

దీపావళి వేడుకలకు ఆహ్వానం



మంత్రి ఉత్తంకుమార్‌ రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న శశికళ

చార్మినార్‌: దీపావళి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి చార్మినార్‌ భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ శశికళ ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ నెల 20న దీపావళి వేడుకలను పురస్కరించుకుని ఆలయంలో పూజలను వైభవంగా నిర్వహించనున్నామని..ఈ పూజల్లో పాల్గొనాలని మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు.

నూతన కార్యవర్గం



నాంపల్లి: టీఎన్జీఓ నిలోఫర్‌ ఆసుపత్రి యూనిట్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. యూనిట్‌ అధ్యక్షుడిగా ఎస్‌.గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌, కార్యదర్శిగా ఈజే జోయల్‌, సంయుక్త కార్యదర్శిగా జనార్దన్‌, కోశాధికారిగా జగన్‌మోహన్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సరిత, కార్యవర్గ సభ్యులుగా మేఘనా జాదవ్‌, మహ్మద్‌ అబ్దుల్‌ అజీజ్‌ ఇర్ఫాన్‌, కె.పృథ్వీరాజ్‌ ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని టీఎన్జీఓ హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కుమార్‌, కార్యదర్శి కురాడి శ్రీనివాస్‌, కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ఆర్‌.రాజ్‌కుమార్‌, కోశాధికారి బాలరాజ్‌ ప్రకటించారు. ఈ కార్యవర్గం గురువారం నిలోఫర్‌ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

చౌమహల్లా ప్యాలెస్‌ చూసొద్దాం రండి..!

ఛాయా చిత్ర ప్రదర్శనతో పాటు కనువిందు చేస్తున్న ప్యాలెస్‌ అందాలు



నిజాం కాలంలో ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన షాండిలియర్స్‌

- నిజాం కాలంలో వాడిన వస్తువులు, ఛాయా చిత్రాలు
- ఆకట్టుకుంటున్న షాండిలియర్స్‌, పాలరాతి శిల్పం
- 8వ నిజాం ముకర్రం ఝా ఎగ్జిబిషన్‌ సందర్భంగా చౌమహల్లా ప్యాలెస్‌పై ప్రత్యేక కథనం

చార్మినార్‌: ఆసఫ్‌ జాహీల రాచరిక పాలనకు అద్దం పట్టే విధంగా ఉన్న పాతనగరంలోని చౌమహల్లా ప్యాలెస్‌లో 8వ ఆసఫ్‌ ఝా, మాజీ హైదరాబాద్‌ నిజాం ముకర్రం ఝా బహదూర్‌ జయంతిని పురస్కరించుకుని అరుదైన ఛాయా చిత్రాల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈ మేరకు ఈ నెల 6న ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన కుమారుడైన 9వ నిజాం అజ్మత్‌ ఝా బహదూర్‌ ప్రారంభించగా..7న నుంచి సందర్శకులకు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు చౌమహల్లా ప్యాలెస్‌ భవనం, అందులోని నిజాం కాలం నాటి వస్తువులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

యూరోపియన్‌ శైలిలో నిర్మించిన శ్వేతసౌధం..

చార్మినార్‌ కట్టడం నుంచి వాకబుల్‌ డిస్టెన్స్‌లో ఉన్న ఈ చౌమహల్లా ప్యాలెస్‌ యూరోపియన్‌ శైలిలో నిర్మించిన శ్వేతసౌధం. ఇది నాలుగు ప్యాలెస్‌ల సముదాయం. ఏకాంతం (ఖిల్వత్‌)గా నిర్మించిన ఈ ప్యాలెస్‌లో పలు నిర్మాణాలు జరిగాయి. 5వ నిజాం అఫ్జల్‌–ఉద్‌–దౌలా–బహదూర్‌ పాలనా (1857–69) కాలంలో ఖిల్వత్‌ ప్యాలెస్‌లో నాలుగు ప్యాలెస్‌ల నిర్మాణం జరిగింది. టెహ్రాన్‌లోని షా ప్యాలెస్‌ను పోలిన ఆర్కిటెక్చర్‌లో ఐదో నిజాం అఫ్తాబ్‌ మహల్‌, మహ్తాబ్‌ మహల్‌, తహనియత్‌ మహల్‌, అఫ్జల్‌ మహల్‌ల నిర్మాణం జరిగింది. 1912లో ఏడో నిజాం ప్యాలెస్‌కు చేయించిన మరమ్మతులతో ప్యాలెస్‌ మరింత శోభాయమానంగా మారింది.

నిజాం ప్రభువుల నివాస గృహంగా..

ఇది నిజాం ప్రభువుల నివాస గృహంగా ఉండేది. దాదాపు 2.90 లక్షల గజాల విస్తీర్ణంలో విశాలమైన ప్రాంగణంలో నిర్మించబడింది. ఆనాటి కాలంలో విద్యుత్‌ లైట్లు లేని కారణంగా ప్యాలెస్‌లో వెలుగుల కోసం షాండిలియర్లను ఏర్పాటుచేశారు. వీటిలో పొగరాని కొవ్వత్తులు, మైనపు ఒత్తులు ఏర్పాటుచేసేవారు. ప్రస్తుతం విద్యుత్‌ దీపాలు ఉండడంతో షాండిలియర్లు దేదీప్యమానంగా వెలుగుతూ చౌమహల్లా ప్యాలెస్‌కు మరింత శోభను తీసుకువస్తున్నాయి. 1915లో చౌమహల్లా ప్యాలెస్‌ ప్రధాన గేట్‌ వద్ద అతిపెద్ద గడియారాన్ని ఏర్పాటుచేశారు.



చౌమహల్లా ప్యాలెస్‌

మ్యూజియంలో చూడదగ్గవి..

ఈ ఛాయా చిత్ర ప్రదర్శనతో పాటు నిజాం కాలంలో వినియోగించిన ఫర్నిచర్‌, మంచాలు, దుస్తులు, తల్వార్లు, ఫొటోలు తదితర విలువైన పురాతన వస్తువులన్నింటిని చౌమహల్లా ప్యాలెస్‌లోని నాలుగు ప్యాలెస్‌లలో భద్రపరిచారు. ప్రస్తుతం నిజాం ట్రస్ట్‌ పర్యవేక్షణలో చౌమహల్లా ప్యాలెస్‌ కొనసాగుతోంది.

ఎక్కడ: యూరోపియన్‌ శైలిలో అత్యంత ఆకర్షణీయంగా పాలరాతి వలే నిర్మితమైన చౌమహల్లా ప్యాలెస్‌ చార్మినార్‌ కట్టడానికి దగ్గరలోని ఖిల్వత్‌లో ఉంది.

ఎలా వెళ్లాలి: చార్మినార్‌ కట్టడం నుంచి లాడ్‌బజార్‌, ఖిల్వత్‌ చౌరస్తా ద్వారా ముందుకెళితే చౌమహల్లా ప్యాలెస్‌ భవనం కనిపిస్తుంది.



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఛాయా చిత్రం

పల్స్‌ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి



శిక్షణ కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్‌ మురళీధర్‌, వైద్యాధికారులు

యాకుత్‌పురా: ఈనెల 12న పల్స్‌ పోలియో సందర్భంగా క్లస్టర్‌ పరిధిలోని 151 ప్రత్యేక పోలియో వాక్సిన్‌ పంపిణీ బూత్‌లను ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వైద్యారోగ్య శాఖ డబీర్‌పురా క్లస్టర్‌ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్‌ మురళీధర్‌ తెలిపారు. గురువారం యాకుత్‌పురా యూపీహెచ్‌సీ కేంద్రంలో వైద్యాధికారులతో కలిసి పారామెడికల్‌ సిబ్బంది, ఆశవర్కర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 12, 13, 14వ తేదీలలో పల్స్‌ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. క్లస్టర్‌ పరిధిలోని డబీర్‌పురాలో 5150 మంది చిన్నారులకు గాను 28 బూత్‌లు, దారుల్‌షిఫాలో 5811 గాను 36, అజంపురాలో 4091 గాను 22, యాకుత్‌పురా–1లో 5344 గాను 27, యాకుత్‌పురా–2లో 6849 గాను 38 బూత్‌లను ఏర్పాటు చేసి పోలియో వాక్సిన్‌ చుక్కలు వేయనున్నామని తెలిపారు. యాకుత్‌పురా రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఓ మొబైల్‌ ట్రాన్సిట్‌ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్‌ ఫర్హనాజ్‌, డాక్టర్‌ భరత్‌, డాక్టర్‌ తబ్సుమ్‌, డాక్టర్‌ హప్స, పారామెడికల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అబిడ్స్‌: చుడిబజార్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రెయిన్‌బో హోమ్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జనహిత సేవా ట్రస్ట్‌, కిమ్స్‌ ఫౌండేషన్‌, రెయిన్‌బో హోమ్స్‌ కమ్యూనిటీ కేర్‌, సొసైటీ ఫర్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో కిమ్స్‌ హాస్పిటల్‌ నుంచి జనరల్‌ ఫిజీషియన్‌, పీడియాట్రిక్స్‌, ఆర్థోపెడిక్‌ వైద్యులు 200 మందికి ఉచితంగా బీపీ, షుగర్‌ పరీక్షించి ఆరోగ్య సలహాలను, మందులు కూడా అందజేశారు. ప్రముఖ ఫిజియోథెరపిస్ట్‌ ఎం.శ్రీనివాస్‌ మోకాలు నొప్పులు, నడుము నొప్పులు ఉన్న వారికి ఎక్సర్‌సైజ్‌లను చూపించారు. భారత్‌ వికాస్‌ పరిషత్‌ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ రక్తంలో హిమోగ్లోబిన్‌ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్‌ టాబ్లెట్లను అందజేశారు. ఈ శిబిరంలో పాఠశాల హెచ్‌ఎం విశాలి, జనహిత సేవా ట్రస్ట్‌ మేనేజింగ్‌ ట్రస్టీ నరసింహమూర్తి, ఎస్‌.ఆర్‌.డీ సంస్థ కో ఆర్డినేటర్‌ శివరాణి, సిబ్బంది ఇందిరా భారతి, అశ్విని, చంద్రకళ, క్యాంప్‌ కో ఆర్డినేటర్‌ నర్సింగ్‌రావు, విక్రమ్‌, మల్లారెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

హెల్త్‌ అసిస్టెంట్లకు సర్వీస్‌ క్రమబద్ధీకరణ చేయాలి



డైరెక్టర్‌ ఆఫ్‌ హెల్త్‌ రవీంద్ర నాయక్‌ను కలిసిన ఎంపీహెచ్‌ఎలు

సుల్తాన్‌బజార్‌: తెలంగాణ జిల్లాల్లోని రెండేళ్ల పైబడి నియమించబడ్డ ఎంపీహెచ్‌ఎ (ఎం) శాశ్వత ప్రాతిపాదికన నియమించిన వారి సర్వీస్‌ క్రమబద్ధీకరణ, డిక్లరైజేషన్‌ను వెంటనే చేయాలని తెలంగాణ హెల్త్‌ అసిస్టెంట్ల సంఘం (ఐఎన్‌టీయూసీ) అధ్యక్షుడు భూషణ్‌, భిక్షం డిమాండ్‌ చేశారు. గురువారం కోఠి డీఎంహెచ్‌ఎస్‌లోని డాక్టర్‌ రవీంద్రనాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 837 మంది ఎంపీహెచ్‌ఏ జీఓ నెం.51 ప్రకారం 2003లో శాశ్వత ప్రాతిపాదికన ప్రభుత్వం నియమించిందని వారు తెలిపారు. అయితే ప్రొబేషనరీ కాలం అయినా సర్వీస్‌ క్రమబద్ధీకరణ అధికారులు చేయడం లేదన్నారు. ఈ విషయమే డీహెచ్‌.రవీంద్ర నాయక్‌ తమ సమస్యలను పరిశీలించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సంఘం నాయకులు మనోజ్‌రెడ్డి, భాస్కర్‌, లోకియ, శ్రీనివాస్‌, సురేష్‌ పాల్గొన్నారు.

పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలి



చాంద్రాయణగుట్ట: ఆర్టీసీ బస్సు చార్జీల పెంపునకు నిరసనగా బీఆర్‌ఎస్‌ పార్టీ తలపెట్టిన చలో బస్సు భవన్‌ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం సీనియర్‌ నాయకుడు, ఉద్యమకారుడు ఆకుల శ్రీనివాస్‌ను అఫ్జల్‌గంజ్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికలకు ముందు అమలుకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ పార్టీ వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. పార్టీ నాయకులు గజ్జల నాగేష్‌, శ్రీశాంక్‌, మహేష్‌ యాదవ్‌, విజయ్‌, తుంగ బాలు, సాయితేజా రావు, హరిబాబు యాదవ్‌, రావుల సతీష్‌, శ్రీనివాసాచారి, మహ్మద్‌ సల్మాన్‌, రాహుల్‌ తదితరులను అరెస్ట్‌ చేసి..అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

బేగంబజార్‌లో జీహెచ్‌ఎంసీ అధికారుల తనిఖీలు



దుకాణాలను సీజ్‌ చేస్తున్న డీసీ ఉమాప్రకాష్‌, ఏఎంఓహెచ్‌ వెంకటరమణ

అబిడ్స్‌: బేగంబజార్‌, ఫీల్‌ఖానా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేస్తూ జీహెచ్‌ఎంసీకి నష్టం కలిగిస్తున్న దుకాణాలను అబిడ్స్‌–14వ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ ఉమాప్రకాష్‌ ఆధ్వర్యంలో సీజ్‌ చేశారు. గురువారం బేగంబజార్‌, ఫీల్‌ఖానా ప్రాంతాల్లో డిప్యూటీ కమిషనర్‌ ఆధ్వర్యంలో ఏఎంఓహెచ్‌ డాక్టర్‌ వెంకటరమణ ఏఎంసీలు, టీఐలు, బిల్‌ కలెక్టర్లు, ఇతర సిబ్బంది పలు దుకాణాలను తనిఖీలు చేశారు. దుకాణాలకు కనీసం ట్రేడ్‌లైసెన్స్‌లు కూడా లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ట్రేడ్‌ లైసెన్సులు లేని 16 దుకాణాలను వారు సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ..జీహెచ్‌ఎంసీ చట్ట ప్రకారం ట్రేడ్‌ లైసెన్సు లేకుండా ఎవరైనా వ్యాపారాలు సాగిస్తే వారి దుకాణాలు సీజ్‌ చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ముజీబ్‌ హుస్సేని

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీఓ సంఘం నిరంతరం పోరాడుతుందని టీఎన్జీఓస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ముజీబ్‌ హుస్సేని తెలిపారు. గురువారం నాంపల్లిలోని టీఎన్జీఓస్‌ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో ఒక వైపు చర్చలు జరుపుతూనే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. త్వరలో టీఎన్జీఓ రంగారెడ్డి జిల్లా విభాగాలకు ఎన్నికలకు విరివిగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్‌ అధ్యక్షుడు కస్తూరి వెంకట్‌, కేంద్ర సంఘ కోశాధికారి సత్యనారాయణగౌడ్‌, ఉపాధ్యక్షులు పర్వతాలు, ఈశ్వర్‌ పాల్గొన్నారు.

డెంటల్‌ అవేర్‌నెస్‌ క్యాంపునకు స్పందన

డబీర్‌పురా: కట్టెలగూడలోని మాస్టర్స్‌ కాన్సెప్ట్‌ స్కూల్‌లో గురువారం ఉస్మానియా డెంటల్‌ ఆసుపత్రి వైద్యుల బృందం డెంటల్‌ అవేర్‌నెస్‌ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపులో విద్యార్థులకు దంత పరిశుభ్రత ప్రాముఖ్యత, నోటి ఆరోగ్య సంరక్షణ పద్ధతులు, రోజువారీ దంత సంరక్షణలో పాటించాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ క్యాంపును డాక్టర్‌ డి.జాహ్నవి (పీజీ)–క్యాంపు ఆర్గనైజర్‌ సమన్వయంగా చేయగా డాక్టర్‌ లీలా లోహిత (సీనియర్‌ రెసిడెంట్‌) పర్యవేక్షించారు. ఇంటర్న్స్‌ డాక్టర్‌ వసంత్‌, డాక్టర్‌ జ్యోతిస్వరి, డాక్టర్‌ నందిని, డాక్టర్‌ మనసా విద్యార్థుల దంత పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు చేశారు. ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌ రావు, హెడ్‌ మిస్ట్రెస్‌ మాధవి, ఇన్‌చార్జి ఆయేషా ఫర్వీన్‌ పాల్గొన్నారు.





డ్రైనేజీ పైప్‌లైన్‌ పనుల పరిశీలన

యాకుత్‌పురా: బ్రహ్మణ్‌వాడిలో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్‌ పనులను గురువారం ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ రెయిన్‌బజార్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెయిన్‌బజార్‌ పోలీస్‌ స్టేషన్‌ ప్రాంతంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న డ్రైనేజీ పనులు పూర్తయ్యాయన్నారు. ఇప్పటికే మంజూరైన సీసీ రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న రౌడీషీటర్‌కు జైలు

సంతోష్‌నగర్‌: రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ రౌడీషీటర్‌కు ఏడు రోజుల జైలు శిక్ష విధించిన ఘటన ఐ.ఎస్‌.సదన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..మాదన్నపేట్‌ శ్రీనగర్‌ కాలనీకి చెందిన ఇస్తిహాక్‌ ఉర్‌ రెహమాన్‌ ఖురేషి (23) రౌడీషీటర్‌. ఐ.ఎస్‌.సదన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో రౌడీషీటర్‌ రెహమాన్‌ ఖురేషి రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా తిరుగున్నాడు. దీంతో ఐ.ఎస్‌.సదన్‌ పోలీసులు రౌడీషీటర్‌ రెహమాన్‌ ఖురేషి అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేసుకొని గురువారం నాంపల్లి కోర్టులో హాజరుపరచగా ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలి



ఫిరాసత్‌ అలీ బాక్రీకి కేక్‌ తినిపిస్తున్న రాంచందర్‌రావు

చార్మినార్‌: దారుషిఫాకు చెందిన బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్‌ ఫిరాసత్‌ అలీ బాక్రీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కేక్‌ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పటిష్టం కోసం మరింత రెట్టించిన ఉత్సాహంతో కృషి చేయాలని రాంచందర్‌రావు తనను ఆదేశించినట్లు మీర్‌ ఫిరాసత్‌ అలీ బాక్రీ తెలిపారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీ యువకులను పార్టీ వైపు ఆకర్షించే చేసే విధంగా పని చేయాలని సూచించారన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

నాంపల్లి: రైల్వే ప్లాట్‌ఫాం మీద ఒంటరిగా ఉన్న వ్యక్తులపై దాడి చేసి సెల్‌ఫోన్లు, నగదును దోచుకెళ్లే ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన మహేక్‌ మొయినుద్దీన్‌ షేక్‌ (19), అజీమ్‌ గౌస్‌ షేక్‌(25) ఇద్దరూ రైల్వేస్టేషన్‌ పరిసరాల్లో ఒంటరిగా ప్రయాణించే వ్యక్తులను టార్గెట్‌ చేసుకుని వారి వద్ద ఉండే సెల్‌ఫోన్లు, నగదును దోచుకెళ్లి జల్సాలు చేస్తారు. గురువారం లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ఇద్దరూ తచ్చాడుతూ కనిపిస్తుండగా పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రయాణికుడిని బెదిరించి సెల్‌ఫోన్‌, నగదును దోచుకెళ్లినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి వద్ద ఉన్న పదివేల విలువైన ఫోన్‌, రూ.300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

చాంద్రాయణగుట్ట: సోదరుడిని బండ రాయితో మోది హత్య చేసిన కేసులో నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... బండ్లగూడ ఇందిరానగర్‌కు చెందిన సుదేశ్‌ కుమార్‌ అలియాస్‌ కుమార్‌ స్వామి (32) 2022లో తన సోదరుడిని బండరాయితో మోది హత్య చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన బండ్లగూడ పోలీసులు కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన 12వ అదనపు స్పెషల్‌ సెషన్స్‌ జడ్జి టి.అనిత నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు.

నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్‌

జియాగూడ: ధూల్‌పేటలో నాటుసారా తయారు చేస్తూ నానక్‌రామ్‌గూడ విక్రయిస్తున్న శంషాబాద్‌ డీటీఎఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌ సిబ్బంది ఇద్దరిని అరెస్ట్‌ చేసి ధూల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు ఆయన వివరాలు వెల్లడించారు. నానక్‌రామ్‌గూడలో అందిన సమాచారం మేరకు ధూల్‌పేటలో రాధికా బాయి, శంకర్‌ వద్ద తయారై నాటుసారా లీటర్‌కు రూ.400 చొప్పున అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిపారు. మీరు తయారు చేసిన నాటు సారాను నానక్‌రామ్‌గూడలోని కిషన్‌సింగ్‌, రేఖ బాయి అనే వారు విక్రయిస్తున్నారని ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు. తయారీదారు వద్ద 10 లీటర్ల నాటుసారాను, దానికి వినియోగించే పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు శంషాబాద్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కృష్ణప్రియ తెలిపారు.

బీ ఫార్మసీ అర్హతతో న్యూట్రీషియన్‌, డైటీషియన్‌ పోస్టులను భర్తీ చేయాలి



వైద్యశాఖ ప్రిన్సిపాల్‌ సెక్రటరీకి మెమొంటోను అందజేస్తున్న సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్‌: బీ ఫార్మసీ అర్హతతో న్యూట్రీషియన్‌, డైటీషియన్‌ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ ఫార్మసీ అసోసియేషన్‌ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్‌ కోరారు. గురువారం వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరి క్రిష్టినా చోంగ్తూకు వినతిపత్రం, మెమొంటో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలలో ముగ్గురు ఫార్మసిస్ట్‌లను నియమించాలని కోరారు. అలాగే బస్తీ, పల్లే దవాఖానాలలో ఫార్మసీ ఆఫీసర్స్‌ పోస్టులు భర్తీ చేయాలని విన్నవించినట్లు తెలిపారు. దీనిపై ప్రిన్సిపల్‌ సెక్రెటరి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ శరత్‌బాబ్‌, అసోసియేట్‌ ప్రెసిడెంట్‌ జాలిగామ అశోక్‌, హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షులు ఏవి.శ్రీహరి పాల్గొన్నారు.

'వృక్ష శాస్త్రానికి ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుంది'



గోల్కొండ: గోల్కొండలోని న్యూ గవర్నమెంట్‌ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జీవవైవిధ్యం పరిరక్షణ రకాలు, జీవ వైవిధ్య సేవలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరీంనగర్‌ ఎస్‌ఆర్‌ఆర్‌ గవర్నమెంట్‌ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీ వృక్ష శాస్త్రం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ పడాల తిరుపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ..వృక్ష శాస్త్రానికి ఎప్పుడూ ఎంతో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ శ్రీలక్ష్మి, వృక్ష శాస్త్రం విభాగాధిపతి అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ బి.రుక్మిణి, బి.విజయలక్ష్మి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌ పాల్గొన్నారు.

స్టూడెంట్‌ ఒలింపిక్‌ క్రీడలకు కార్తీక్‌ ఎంపిక



కోచ్‌ ఫర్హాన్‌ ఫారూక్‌తో వైసీఎస్‌ కార్తీక్‌

గోల్కొండ: సరైన ప్రోత్సాహం, శిక్షణ ఉంటే క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడల్లో అద్భుతంగా రాణిస్తారని ప్రముఖ క్రికెట్‌ కోచ్‌ ఫర్హాన్‌ ఫారూక్‌ అన్నారు. షేక్‌పేట్‌కు చెందిన ఏపుబంటి చాణిక్య నంద కార్తీక్‌ హరియాణాలోని మహర్షి దయానంద్‌ యూనివర్సిటీలో జరగనున్న స్టూడెంట్‌ ఒలింపిక్‌ అసోసియేషన్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. షేక్‌పేట్‌లోని ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో చదువుతున్న కార్తీక్‌ను గురువారం టోలిచౌకీలోని ఫారూక్‌ క్రికెట్‌ అకాడమీలో సన్మానించారు. ఈ సందర్భంగా కోచ్‌ ఫర్హాన్‌ ఫారూక్‌ మాట్లాడుతూ..కార్తీక్‌ మూడేళ్లుగా స్కూల్‌, డిస్ట్రిక్‌, ఇతర క్రికెట్‌ టోర్నమెంట్‌లలో అండర్‌–14 కేటగిరిలో విశేషంగా రాణిస్తున్నారన్నారు.

ఘనంగా రతన్‌ టాటా వర్ధంతి



కార్యక్రమంలో ప్రొఫెసర్‌ ఇటికల పురుషోత్తం తదితరులు

గోల్కొండ: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా వర్ధంతి గురువారం మెహిదీపట్నంలోని సెయింట్‌ ఆన్స్‌ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కౌన్సిల్‌ ఆఫ్‌ హైయర్‌ ఎడ్యుకేషన్‌ వైస్‌ ఛైర్మన్‌ ప్రొఫెసర్‌ ఇటికల పురుషోత్తం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిటిజన్స్‌ కౌన్సిల్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..పారిశ్రామిక రంగానికి దివంగత రతన్‌ టాటా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్‌ సిస్టర్‌ ఏ.విజయరాణి అధ్యక్షతన వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్‌ కామర్స్‌ ప్రొఫెసర్‌ ఏ.ప్యాట్రిక్‌ ప్రధాన వక్తగా పాల్గొని విద్యార్థులకు తమ సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గా సెక్యూరిటీ అండ్‌ మ్యాన్‌ పవర్‌ కన్సల్టెంట్‌కు చెందిన బాలకిషన్‌, కళాశాల కామర్స్‌ డిపార్ట్‌మెంట్‌ హెడ్‌ మహిత, టీసీసీ చీఫ్‌ కోఆర్డినేటర్‌ మహ్మద్‌ అక్తర్‌ షరీఫ్‌, డాక్టర్‌ శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.